# వేళా విశేషం

చంద్రం తన స్నేహితుడు రామం దగ్గరికి వెళ్ళాడు. అతడు ఏడాది అయింది ఉద్యోగంలో ప్రవేశించి. నెలకో పెద్ద కాగితం తెచ్చుకుంటున్నాడు. పెళ్ళామూ తనూ జల్సాగా గడుపుతున్నారు. అతనికి వివాహం అయి పదమూడు నెలలయింది, ఎందుకిలా చెప్పవలసి వచ్చిందంటే ఆ పెళ్ళికీ అతని జీవితానికి చాలా సంబంధం వున్నదంటాడు. జీవితంతో సంబంధం వుండడం ఎలాగూ నిజమే కాని అతని అదృష్టమంతా అందువల్ల నేనని అంటాడు. ఆ భార్యా భర్త లిద్దరూ ఎంత ముచ్చటగా కాపరం జేస్తున్నారూ అంటే ఈయన వెళ్ళిన రెండు రోజులూ పానకంలో పుడకలాగ వాళ్ళ స్వేచ్ఛగా వుండడానికి వీల్లేకుండా ఎందుకు వెళ్ళేడా? అని చంద్రానికే అనిపించింది.

ఏడాది క్రిందట వాడు ఉద్యోగం లేకుండా తిరిగిన రోజులు చంద్రానికి బాగా జ్ఞాపకం వున్నాయి. అయితే ఒక సుకృతం ఏమిటీ అంటే అప్పటికి రామానికి పెళ్ళి అవలేదు కాబట్టి ఆ బాధ్యతలేవీ వుండేవి కావు. ఇంట్లో యింత తిండిపడేస్తూ వుంటే తిని చాంద్రాయణం చిత్తగించేవాడు. ఎక్కువగా ఒత్తిడి వుండేది కాదు. కాస తెలిసిన బంధువుల యిళ్ళకి పిలవక పోయినా ఈ ఉద్యోగం అనే మిషమీద వెళ్ళి తిష్ట వేసేవాడు, వాళ్ళ మోమాటం పడి వుండమన్నా వాళ్ళూ వుండి, వాళ్ళ సూచావాచాగా పొమ్మని చెప్పే వరకూ కదిలేవాడు కాదు. ఈ ఖర్మ ఎందుకంటే ఉన్న వూళ్ళో అయితే తెలిసిన వాళ్ళూ యింట్లో వాళ్ళూ ఉద్యోగం లేదని ఎత్తిపొడుస్తుంటారు. ఈ బాధ తప్పించుకుందికి సాధ్య

మయినంత మట్టుకు అలా తిరుగుతూ వుంటాడు. ఎన్నాళ్ళు తిరిగినా ఉద్యోగం దొరకలేదు. ఎవరూ కనికరించి అయినా ఉద్యోగం వేయించ లేదు. ఆఖరికి విసిగి కొన్నాళ్ళపాటు ఫికరు లేకుండా పారిపోయి దేశా లన్నీ టిక్కట్టు లేకండానే తిరిగి, ఇంటికొచ్చేశాడు.

తన కాళ్లమీద తను నిలవలేని యిలాంటి స్థితిలో కూడా రామం తల్లిదండ్రులు ఎలాగో మెడవంచి పెళ్ళి చేసేశారు. మొదట్లో రామం చిక్కులు పెట్టినా..."నువ్వేం పోషించనక్కర్లేదు. అయినా పెళ్ళికీ ఉద్యోగానికి ముడి ఏమిటి? అదృష్టం బావుంటే అదే అవుతుంది. మనం అందరం వుంటుండగా లేనిది ఆ కోడలొస్తేనే బరువా? మనతోబాటు వుంటుంది. కోడలంటూ వుంటే ముద్దుముచ్చటాను. అయినా పాతికేళ్ళు వచ్చినా ఎన్నాళ్ళిలా వుంటావు?"

ఇలాంటి మాటల్తో రామాన్ని లొంగదీసి పెళ్ళి చేసేరు. ఏదో సామెత చెప్పినట్టు చదువు, ఉద్యోగం, ఇవి అయేవరకూ పెళ్ళాం అగు తుందా? సంసారం ఆగుతుందా? "ఉప్పుతోనే తక్కినవి" అన్నట్టు ఆలస్యం ఎందుకని పెళ్ళి కాస్త అయిందనిపించేశారు.

రామం అదృష్టం బావుండి ఉద్యోగం కూడా వెంటనే అయింది. ఈ సందర్భంలోనే ఒకసారి చంద్రం రామంతో—

"నువ్వు అదృష్టవంతుడివిరా?" అని అన్నాడు.

"నేను మొదట్లో నా జన్మలో ఉద్యోగం దొరకదని అనుకున్నా నురా? జేబు ఖర్చుకి కాని కావలిసినా ఇంట్లో అడుక్కునే వాడికి పెళ్ళాం కూడా వస్తే ఎంత యోగ్యంగా వుంటుంది? అందుకనె మొదట్లో ఒప్పుకో లేదు. అయితేనేంలే ఆ ఒప్పుకోవడమే మంచిదయింది. లేకపోతే ఈ ఉద్యోగం బాధపడలేక ఈపాటికి ఏ రైలు కిందో బుర్ర పెట్టేసేవాడిని ఆ ముహూర్త బలం ఎటువంటిదో గాని చూశావు కదూ! పెళ్ళి అయిన నెళ్ళాళ్ళు తిరక్కుండా ఆర్డరు వచ్చింది. అప్పటికి నాలో జీవం కదిలిం దనుకో! ఇదంతా నా పెళ్ళి మూలంగా వచ్చిన అదృష్టమే అని నాకు గట్టి నమ్మకం వుండిపోయింది" అని రామం అన్నాడు.

చంద్రం ఆశ్చర్యంతో ఈ మాటలు విని—

"అయితే నీకీ వుద్యోగం దొరకడం నీ పెళ్ళి వల్లనే అంటావా?" అని అన్నాడు!

"ఇంకా అనుమానం ఏముందిరా? ఆ ముహూర్తంలో ఏదో విశేషం లేందే యిలా అయిన తక్షణం ఉద్యోగం దొరకడం యేమిటి? అందుకే నాకా నమ్మకం వుంది."

"అవున్లే వుంటుంది!" అని చంద్రం అప్పటికా ప్రసంగం చాలించడానికని, అని వూరుకున్నాడు.

చంద్రం యింటికిపోతూ అనుకున్నాడు—

"నిజమే అదృష్టం కలిసివస్తుంది! కానీ అది ఏ ఒక్కొక్కరికో అనిపిస్తూ వుంటుంది— తన పెళ్ళి వల్లనే ఉద్యోగం దొరికింది. ఆ ముహూర్త విశేషం వల్లనే తనకా అదృష్టం కనిపించింది అనే నమ్మకం రామానికి కలగడం సహజమే! ఒక్క రామమే కాదు! అతనిని ఎరిగి వున్న వాళ్ళందరూకూడా అదే ముక్క అన్నారు. అందరూ అనుకున్న మాటలూ రామం నమ్మకం విన్న తర్వాత "ఏది ఎలా వున్నా వాడి అదృష్టం బావుంది రెంతూ ఒక్కమారే కలిసి వచ్చేయి" అని అనుకున్నాడు చంద్రం.

* * * *

"పోస్టాఫీసు దగ్గర చంద్రం, గోపాలం కలుసుకున్నారు. గోపాలం ఏదో కవరు డొక్కులోవేసి చంద్రం దగ్గరికి వచ్చేడు.

"ఏమిటోయ్ అంత పెద్దది వుంది. ఆ కవరు?" అని అడిగేడు చంద్రం.

"ఏముంది? మళ్ళీ రెండు రూపాయల ముడుపు చెల్లించుకున్నాను ఉద్యోగానికి దరఖాస్తు?"

"పోన్లే ఈ రూపంగానయినా పేపర్లు చూస్తుంటే ప్రపంచజ్ఞానం వస్తుంది."

"ఏదో ఆనవాయితీ ప్రకారం మొక్కు తీర్చుకోడమేగాని ఈ అప్లికేషన్లవల్ల ఉద్యోగం దొరికేటట్టు కనబడదు."

"అర్జీలవల్ల ఉద్యోగాలూ, ఆశీర్వచనాలవల్ల బిడ్డలూ లభ్యమవుతాయట్రా. ఈ సామెత తెలీదూ !"

ఇలా మాట్లాడుతూ పోతూంటే గోపాలం జేబులోంచి రూపాయి నోట్లుతీసి ఒక చీరా జాకెట్టు గుడ్డా కొన్నాడు.

"ఏమోయ్ ! ఏమిటీ సందడి ? నీ దగ్గర ఇంత డబ్బు ఎప్పుడూ చూడలేదు?" అని చంద్రం అడిగేడు.

"ఏం కాదోయ్ చంచల లక్ష్మి! అంతే..."

చెబుతూ విశేషం ?

"ఇవాళ శ్రీవారు వస్తారని చెప్పలేదటోయ్."

"ఓహో ! అవునవును. మరిచిపోయేను. అప్లికేషన్ పెట్టగానే మంచి ఉద్యోగం దొరికిందిలే శుభం!" అని చంద్రం ఎగతాళి చేసేడు.

"పోన్లేద్దూ నువ్వూ చేస్తున్నావుగా ?" అని రామం అంటించాడు.

తరువాత ఇంటికి ఎవరి దారిని వారు పోయేరు. చంద్రం, గోపాలం దగ్గిర బంధువులే. గోపాలానికి ఇప్పటివరకూ ఏ ఉద్యోగమూ దొరకలేదు. ఖాళీలు ఉన్నా లేకపోయినా అన్ని ఆఫీసులకీ దరఖాస్తులుపెట్టిస్తూ వుంటాడు ఒక్క ఎడ్వర్టయిజుమెంటు కూడా వదలడు. కాని ఏం లాభించలేదు. చివరికి విసుగెత్తి ఆఫీసర్లనందర్నీ ఇలాటి వారు, అలాటి వారు అని చెడా మడా తిడుతూ ఉంటాడు.

గోపాలానికి పెళ్ళి అయి రెండు సంవత్సరాలయింది. పిల్ల చిన్నదవడంవల్ల ఇన్నాళ్ళు కాపరానికి రాలేదు. ఆ ఆటంకం తీరగానే నెళ్ళాళ్ళ క్రిందటకార్యం చేసేడు ! అదయింతర్వాత మంచిది చూసుకొని ఆమెని ఇదేమొదటిసారి గోపాలం ఇంటికి తీసుకు రావడం...

చంద్రం ఇంటికి రాగానే ఇంట్లో అందరూ ముస్తాబవుతున్నారు. అటు ఆడపిల్ల గలవారూ, ఇటు గోపాలం వంక వాళ్లూ కూడా దగ్గర వాళ్ళే కనక గోపాలం పెళ్ళాన్ని తీసుకు వస్తున్నారంటే చూడ్డానికి వెళ్ళక తప్పదు. చంద్రం కూడా బయలుదేరాడు.

లాంఛనాలతో సహా గోపాలం భార్యా శుభ లక్షణాలతో ఇంట్లో కాలుపెట్టిన అందరూ పరిచయం అయేరు. అ గోపాలం దంపతుల్ని చూసి చంద్రం ఆనందించేడు. అందరూ కూర్చొని మాట్లాడుతున్నారు చంద్రం హాస్యమాడుతూ వుంటే గోపాలం సిగ్గుతో ముసిముసిగా నవ్వుకుంటున్నాడు. ఆ పిల్ల వచ్చి ఇంకా ఎంతసేపో కాలేదు ! ఇంతలో గోపాలం నాన్నగారు మహా సంతోషంతో వచ్చేడు. రాగానే కొడుకూ, కోడలూ నమస్కరించేరు.

"అడుగు పెట్టగానే అదృష్టం అలా కలిసి రావాలి. పుత్ర పౌత్రాభివృద్ధిలో సుఖించండి!" అంటూ దీవించాడు.

చంద్రం మొదలగు వాళ్ళందరూ ఆతృతతో ఆయన వైపు చూస్తున్నారు.

"వేళావిశేషం ఏమిటోగాని ఇదిగో ఇప్పుడే గోపాలానికి రైల్వేలో పని అయింది. రేపే బయలుదేరి వెళ్ళాలి! శుభం" అని అంటూ ఆ కాగితాన్ని గోపాలానికి అందించాడు.

అది చూసి గోపాలం సంతోషానికి తెంపులేదు ఆ ఆనందంలో అప్రయత్నంగా తన భార్యవైపు చూస్తూ కొంతసేపు వుండిపోయేడు. ఆ చూపులో ఏదో స్థిరమైన నమ్మకం వుంది ఆ పిల్ల చూపు కూడా కలిపి కంటి రెప్పలతో అదృష్టాన్ని ఆహ్వానిస్తున్నట్టు ఒకసారి ఇతని వైపు చూసి మళ్ళీ దించేసుకుంది.

గోపాలం తల్లి కోడలిని దగ్గరకు తీసుకుంది.

"నా తల్లి నీదే అదృష్టం అంతాను. లక్ష్మీదేవిలా వచ్చావు. నువ్వు కాలు పెట్టగానే కలిసి వచ్చింది. తొలిచూలు కొడుకునే కంటా వులే" అని దీవించింది.

తర్వాత చంద్రం తాలూకు వాళ్ళందరూ బ్రహ్మరథం పట్టేరు. గోపాలానికి ఉద్యోగం దొరకడం వాడి పెళ్ళాం ఇంట్లో పాదం పెట్టిన వేళావిశేషమేనట! ఏదయినా ఇలాటి సమయాల్లోనే జరుగుతూ వుంటా యట కొందరి కయితే 'కోడలి గృహ ప్రవేశమూ, అత్తగంగా ప్రవేశమూ' జరుగుతుంటాయట. మరి కొందరికి 'పిల్ల వచ్చింది పిడుగు పడింది' అన్నట్టవుతుందట. కాని గోపాలం మాత్రం పిల్ల వచ్చినవేళ పిలచి వచ్చినట్టు అదృష్టం కలిసి వచ్చింది."

"ఇదంతా దాని చలవ !"

"దాని మొనుం చూస్తేనే చాలు తెలుస్తూంది అదృష్ట దేవత అని."

"ఇంకేం అది రావడమే కాకుండా ఆమెతో కూడా మొగుడికి ఉద్యోగంకూడా కానుకగా తెచ్చింది ! వాళ్ళ బ్రతుకు వాళ్ళు చూసుకుంటారు."

ఇలా అందరి దీవెనలూ అయిన తరువాత చంద్రం వాళ్లూ తిరిగి వెళ్ళిపోయేరు.

ఆ తర్వాత గోపాలం కూడా చంద్రంతో అన్నాడు—

"చూశావురా! యింకా ఏదీ అది యిలా గుమ్మంలోకి వచ్చిందో లేదో ఆర్డరు గుప్తు కొచ్చింది. ఒక్కొక్కళ్ళ చలవరా ! అది దాని ధర్మమా అని ఇద్దరి జీవితాలకీ దారి దొరికింది" అని అన్నాడు.

ఈ మాటలు అంటూంటే—

ఆర్డరు వచ్చిందని మొదటిసారి తండ్రి చెప్పినపుడు గోపాలం భార్య వైపు చూసినపుడు అతనిలో కలిగిన స్థిరమైన నమ్మకం ఏమిటో చంద్రానికి ఇప్పుడు బోధపడింది, చంద్రం ఈ మాటలు ఆశ్చర్యంతో విని—

"అయితే నీకీ ఉద్యోగం నీ పెళ్ళాంవల్లనే దొరికింది అంటావా" అని అడిగేడు.

"బాప్పుంటిరోయ్! ఇంకా అనుమానం దేనికి ? చూడు ఇన్నాళ్ళు చచ్చి గింజుకున్నా, కనీసం బంట్రోతు పని అయినా దొరికిందీ ? అలాటిది ఆమె రాగానే తక్షణం ఉద్యోగం దొరికింది అంటే ఆ కాలు పెట్టిన ముహూర్త బలం కాకపోతే వేరే ఏముంది ? అంచేత మా అదృష్టం అంతా దానివల్లే అని నాకు గట్టి నమ్మకం!" అని అన్నాడు.

"ఏమిటోయ్! కొందరికి పెళ్ళాల మూలంగా ఆస్థి కలిసొస్తుంది ! మరి నీకు కళత్రం మూలంగా ఉద్యోగం వచ్చిందంటున్నావు !"

"అవును. ఆస్థి కలిసి రావడం నిజమే కాబట్టి ఇదీ నిజమే. అందుకే నాకా నమ్మకం గట్టిగా వుండిపోయింది.

"సరేగాని ఇద్దరూ కలిసే వెళతారనుకుంటా !"

"అలాగే చెయ్యాలని చూస్తున్నా—వెలుతురుని మనతో కూడా తీసుకువెళితే చుట్టూ చీకటి వున్నా మనకి మాత్రం అడ్డురాదు కదుటోయ్. అంచేత దొరికిన అదృష్టం తర్వాత వదలకండా మనతోనే తీసుకుపోతే దానివల్ల మనలోని దురదృష్టం పారిపోతూంది. ఎటునుంచి ఏది వచ్చినా మంచిదే చూడు...కొన్ని పాపపు గ్రహాలు వున్నా...అవి మంచిగ్రహాల దృష్టిలో వుంటే ఫరవాలేదని పెద్దవాళ్ళంటూ వుంటారు చూడు!" అని గోపాలం అన్నాడు.

గోపాలం మాటలూ, ఇంట్లో తన వాళ్ళందరూ అన్న మాటలూ విన్న తర్వాత "ఏది ఎలా వున్నా వాడి అదృష్టం బావుండి రెండు ఒక్కమారే కలిసి వచ్చేయి" అని అనుకున్నాడు చంద్రం.

* * * *

ఆ మర్నాడే మూర్తి వాడి భార్యా ఎనిమిది నెల్ల పిల్లడూ చంద్రం ఇంటికి వచ్చారు. మూర్తి చంద్రానికి స్నేహితుడు. అతడు జాతకాలు బాగా వ్రాస్తాడు. అందరికీ చెప్పిన దానిలో మంచి గురి! చంద్రంకి

కొడుకు పుట్టగానే వ్రాస్తే జాతకం వ్రాసి పంపాడు. అందులో చంద్రం కొడుకు పుట్టిన లగ్నమూ, ఘడియా, తిథి, వారం, నక్షత్రం వీటిబట్టి మంచి జాతకం అయింది. ఆ జాతకంలోవున్న మంచిగ్రహాల స్థానాల బట్టి ఆ బిడ్డయొక్క తండ్రికి అనగా చంద్రానికి మంచి యోగం నెల్లాళ్ళ లోపుని వుందనివ్రాసేడు. ఇప్పుడు చంద్రాన్ని, వాడి కొడుకుని చూద్దానికని సెలవు పెట్టుకొని వచ్చాడు.

అతడు వచ్చీరావడంతోనే "ఏంరా? ఏదయినా అర్థమవచ్చిందా?" అని అడిగాడు.

"అయితేనేదిలే! యిది తప్పదు! నే చెప్పాను చూడు! ఒకరోజు రెండురోజులు అటో యిటో అంతే అయినా యిది నా చేతిలోని... ఏ చేతిలోని వుందా?"

"మీ వాడిది గొప్ప అదృష్టజాతకం! నాకు పెద్దవాడయ్యే వరకూ ఆ అదృష్టం అంతా నీకు యోగిస్తుంది! యీ సంగతి వాడి జాతకంలో వున్న గ్రహాల పొందికే చెబుతున్నదిగాని మరోటి కాదు!" అన్నాడు. చంద్రం ఏమీ జవాబు చెప్పలేదు. కొంతసేపయ్యాక మూర్తి

"నాకు ఆశ్చర్యంగా వుందిరా జాతకం ప్రకారం నెల్లాళ్ళలో అవవలసింది... నీకింకా అవలేదు. అదీ విచారంగా వుంది!" అన్నాడు.

"ఏమిటోరా నాకేం ఆశలేదు!" అన్నాడు నిస్పృహతో చంద్రం.

"ఇంతకీ ఆ రోజు, అదృష్టం కలిసిరావాలి. అంతేగాని, ఏంచేసినా లాభంలేదోయ్!" అన్నాడు మూర్తి.

"దురదృష్టం పిలకపోయినా పలకరిస్తుందిగాని అదృష్టం పిలిచినా పలకగుండా వుంది."

"ఫరవాలేదురా! నీకూ ఆ టైము వస్తుంది! తొందరపడకు!"

"అప్పులపాలయి వున్నదంతాపూడ్చుకుపోయిన తర్వాత ఎప్పుడో ఏ విధంగానో లాటుగా డబ్బు దొరికినా ఏం లాభంరా? ఈ వచ్చిందంతా ఆ చేసిన అప్పుకి సరిపోదూ? అలాగే దురదృష్టంలో మొదట

గుక్కలు మింగినవాడికి అదృష్టం ఒక్కసారి కలిసివచ్చినా దానికీ దీనికీ చెల్లు అయిపోతుందనుకుంటాను."

"అది వేరు ఇది వేరు! అదృష్టంవస్తే అది ఖర్చు అయేది కాదు తెలుసా?"

"సరేలే మంచిదే అయితే!" అని చంద్రం పూరుకున్నా — మూర్తి—

"పోనీ నీకు నమ్మకం లేకపోతే నా సంగతి నీకు తెలుసు కదా? నాకేమిటయింది? మా వాడి జాతకం కూడా ఇటువంటిదే అని నీకు చెప్ప లేదూ? మా వాడు పుట్టాక..."

అని మూర్తి చెప్పబోతున్నాడు. అతడేం చెబుతాడో చంద్రానికి తెలుసు.

మూర్తికి పెళ్ళిఅయి పిల్లడు పుట్టేవరకూ కూడా ఉద్యోగం అవ లేదు. ఈ కుటుంబాన్ని పోషించలేక వీడు ఎనిమిది నెలల క్రితం వరకూ పడిన బాధలు అందరికీ తెలుసు. దానికితోడు మూర్తి భార్యా కడుపుతో వుండగా మూర్తి పిచ్చెత్తిపోయాడు. జీవితం గడిపేది ఎలా? అన్న ఆలో చనలోపడి రెండు మూడు నెలలపాటు మెదడు చెడి వెర్రివికారం ఎత్తిపో యేడు. తర్వాత కొడుకు కలిగే వేళకి తగ్గిపోయింది. మూర్తి కొడుకు మంచి నక్షత్రాన్ని పుట్టేడు. వాడు పుట్టిన ముహూర్తం బట్టి మూడునెలల లోపున తండ్రికి గొప్ప అదృష్టం వున్నదని మూర్తి అనుకున్నాడు. ఆ జాతక ఫలితాన్ని తలుచుకొని ఆనందించేవాడు. అయితే అనుకున్నట్లూ నెల తిరక్కుండానే ఉద్యోగం రావడంవల్ల— మూర్తి ఈ ఉపమానం చంద్రం దగ్గిర చెబుతూవుంటాడు.

చంద్రానికి కొడుకు పుట్టి ఆరు నెలలయింది. చంద్రం కొడుకు జాతకం ఆ విధంగానే అమోఘమైందని ఆ జాతకం ప్రకారం చంద్రానికి నెల్లాళ్ళలోగా అదృష్టం కలిసిరావాలని ఖచ్చితంగా మూర్తి చెప్పేడు. అది అవకపోబట్టి ఇలాటి ఉపశమన వాక్యాలు చెబుతూవుంటాడు.

చంద్రానికి కొడుకు పుట్టిన కొత్తలో అందరూ ఎన్నో విధాల అన్నారు.

"తొలికాన్పు కొడుకు! చాలా అదృష్టం" అని. "జాతకం చాలా గొప్పదట! వాళ్ళ నాన్నకి తప్పకుండా అదృష్టం కలుస్తుంది!" అని.

"ఇదిగో! కొడుకు పుట్టేడు తక్కినవి కూడా అవే అవుతాయి. చూస్తూండండి మంచి అదృష్ట జాతకుడు!" అని యిలా అందరూ అన్నారు.

వీళ్ళ మాటలు వీళ్ళవేగాని రోజులూ, పరిస్థితులూ ఎప్పట్లాగే వున్నాయి.

ఇదంతా చూస్తున్న మూర్తి తెలిసి కూడా వూరుకోడు ఆఖరికి అతడు వెళ్ళిపోయేముందర కూడా చంద్రంతో...

"ఒరేయ్! నే చెప్పేది నమ్మకుండావున్నావు నేనూ మొదట్లో ఇలాగే అనుకున్నాను. ఇలాటివాటివల్ల యేమవుతుందీ అని కాని నాకు జాతకాల మీద నమ్మకంవుంది కాబట్టి ఓపికపట్టాను. ప్రతి మనిషికీ ఒక్కొక్క దశవుంటుంది. అ దశలోనే ఆ వ్యక్తి జీవితం తెలిసిపోతుంది. జీవితంలో అదృష్టం ఒక్కొక్కడికీ ఒక్కొక్కమారే వస్తుంది. ఆ రోజు ఏదోచెప్పలేంగాని ప్రతివాడికీ ఆ సమయం ఎప్పుడో ఒకప్పుడు వస్తుంది. ముఖ్యంగా మొగవాడికి జీవితంలో మూడు ఘట్టాల్లో అదృష్టం దానంతటదే వస్తుంది అంటారు. పెళ్ళి అయిన తర్వాత ఒకడి జాతకం మారుతుంది. అప్పుడు వాడికి అదృష్టం కలుస్తుంది. మరొకడికి భార్యా కాపురానికి వచ్చాక అదృష్టం పలుకుతుంది. ఇంకొందరికి తొలి సంతానం కలిగిన తర్వాత దశమారి అదృష్టం తన్నుకొస్తుంది. నీకు యీ మాటు మాత్రం తప్పదు! చూడు. నా కొడుకు జాతకం ప్రకారం నాకు ఉద్యోగం అయిందా, లేదా! నీకూ ఇవాళో రేపో అవుతుంది" అని అన్నాడు.

ఇలాంటి ఉపశమన వాక్యాలు చెప్పి మూర్తి వెళ్ళిపోయాడు.

మూర్తి చెప్పిన మాటలు ఆశ్చర్యంతో వినడం తప్పిస్తే మరేమీ అనలేకపోయాడు. చంద్రం అవన్నీ నిజమే అని నమ్మగలడా? కాని

మూర్తివంక వాళ్ళందరూ 'అది నిజమే' అని అన్నారు. అంతగాచెప్పినా మూర్తి విషయంలో కూడా "ఏది ఎలావున్నా వాడి అదృష్టం బావుంది రెండూ ఒక్కమారే కలిసివచ్చాయ్" అని అనుకున్నాడు చంద్రం ... కాని...

పెళ్ళి అయిన తర్వాత కలిసిన అదృష్టంయొక్క అనుభవాన్ని బట్టి, రామం—ఇలాటి కలిసిరావడాలు నిజమేనంటాడు.

పెళ్ళాం కాలుపెట్టాక కలిగిన అదృష్టాన్ని పురస్కరించుకొని గోపాలం అవునంటున్నాడు.

తన కొడుకు జాతక రీత్యా వచ్చిన అదృష్టం తలుచుకొని నిజమని నమ్మమంటున్నాడు మూర్తి.

ప్రత్యక్షమయిన నిదర్శనాలుబట్టి, విన్నవాళ్ళూ, చూసినవాళ్ళూ అందరూ అవునంటే అవునంటున్నారు.

కాని యీ మాటలూ, యీ సంఘటనలూ నమ్మడమో నమ్మకపోవడమో చంద్రానికి అర్థంకాలేదు— ఎందుచేతంటే.

చంద్రానికి పెళ్ళి అయింది. జాతకం మారలేదు!... పెళ్ళాం వచ్చింది. దశ మారలేదు:... పిల్లడు పుట్టాడు: ఫలితం కనబడలేదు:... ఎన్నాళ్ళయినా ఉద్యోగం దొరకలేదు!!!